# నాస్తికుడు

నిటలాక్షం భక్త పరమాణువు. భక్తాగ్రేసర చక్రవర్తి అన్నా అనొచ్చు. అదివారం అరసవెల్లిలో ఆదిత్యుని దర్శిస్తాడు. సోమవారం సోమేశ్వరాలయానికి వెళతాడు. మంగళవారం ఆంజనేయస్వామి గుడికి వెళతాడు. బుధవారం ఖాళీ. గురువారం షీర్డీ సాయిబాబా గుడికి వెళతాడు. శుక్రవారంమళ్లీ ఖాళీ. శనివారం వేంకటేశ్వరుని సందర్శిస్తాడు. ఇవికాక, అదనంగా అప్పుడప్పుడు సత్యసాయి, మెహెర్‌బాబాల భజన కార్యక్రమాలకు హాజరవుతూంటాడు.

ఇటువంటి భక్తాగ్రేసర చక్రవర్తి అయిన నిటలాక్షంగాడు ఒకనాడు సడన్‌గా నాస్తికుడై పోతాడా?

'బాబాలూ గీబాలూ బోగస్' అన్నాడు.

నిటలాక్షంగాడిలో వచ్చిన మార్పుకి 'శిష్టచతుష్టయం' అనే అతని నలుగురు మిత్రులూ ఆశ్చర్యపోయేరు!

"వీడికేం పోయికాలం దాపురించింది చెప్మా?' అన్నాడు మొదటివాడు.

"ఏదైనా లాటరీ తగిలిందా? డబ్బుంటేనే కదా దేవుడి మీద భక్తి నశించేది?' అన్నాడు రెండోవాడు.

సూర్యచంద్రాదులు, గ్రహాలు, నక్షత్రాలు, నదీనదాలు అడవులు కొండలు సృష్టించిన దేవుణ్ని వీడు కాదంటున్నాడు?' అన్నాడు మూడోవాడు.

'లోకంబులు, లోకేశులు, లోకస్థులు, తెగిన తుది, అలోకంబగు పెంజీకటికవ్వల, యెవ్వండేకాకృతి వెలుగు, అతనినే సేవింతున్' అని గజేంద్రుడన్నాడు. అంతటి గజేంద్రుడే దాసోహం అయిపోయేడే? ఈ అనంతకోటి జీవరాశుల్లోనూ ఈ వెధవ ఓ నీటి బుడగ! వీడెంత? వీడి బతుకెంత?' అన్నాడు నాలుగోవాడు.

"అది కాదురా బాబూ! నన్ను మీరు పూర్తిగా అపార్థం చేసుకున్నారు. నేను ఏ దేవాలయానికి వెళితే అక్కడో చెప్పులజత పోయేది. అలాంటివి అరడజను చెప్పుల జతలు పోయేయి. ఆరు వందలురూపాయల ఆస్తిని పోగొట్టుకున్నాను. మళ్లీ కొనుక్కుందికి నా దగ్గర ఆస్తి లేదు. ఆ విధంగా నాస్తికుణ్ణి (నష్టస్ ఆస్తికుడు) అయిపోయేను.

-సర్వజగత్తుల్నీ రక్షంచే దేవుడు, భక్తుల పాదరక్షల్ని రక్షించలేకపోతున్నాడు! ఇహ దేవుడెక్కడున్నట్టు?" అని విపులీకరించేడు నిటలాక్షం.

⊗⊗⊗

8-6-1992

ఆంధ్ర భూమి దినపత్రిక